క్లుప్తంగా

సట్ల అంజలికి ఉత్తమ నంది అవార్డు



అంజలిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ బసవరాజ్

దుండిగల్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కళాకారిణి సట్ల అంజలికి తెలంగాణ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉత్తమ నంది అవార్డు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం సభ్యులు, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య ఆధ్వర్యంలో బుధవారం అంజలిని సత్కరించారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

నిజాంపేట్: ప్రభుత్వ భూమిని అక్రమించి అనుమతులు పొందిన స్థలాన్ని పరిరక్షించాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. బాచుపల్లి సర్వే నం.186లోని 1600 గజాల ప్రభుత్వ భూమిని గతంలో కొందరు వ్యక్తులు ఆక్రమించుకోగా అప్పటి కమిషనర్ గోపీ అడ్డుకున్నారని, తాజాగా ఇదే స్థలం విషయమై హెచ్ఎండీఏ నుంచి భవన నిర్మాణానికి అనుమతులు పొందారన్నారు. సర్వేనం.182 ప్రైవేట్ సర్వే నంబరుతో సదరు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. ఈ విషయమై విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. బుధవారం మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ పోలీసులకు రివార్డులు

నిజాంపేట్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి బుధవారం సీపీ స్టీఫెన్ రవీంద్ర రివార్డులు అందజేశారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 5వ తేదీన గంజాయి విక్రయదారుడిని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి 41 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీస్ సిబ్బందిని సత్కరించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ నర్సింహారెడ్డి, ఎస్సై సాయినాథ్, కానిస్టేబుళ్లు రాజు, రాజేష్‌కుమార్, కనకయ్య, హరిలాల్‌నుప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ 17వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి బుధవారం జల మండలి అధికారులకు వినతి పత్రం అందజేశారు. కొత్త పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా అధికంగా వస్తున్న నీటి బిల్లులను మాఫీ చేయాలన్నారు.

ఇది ఎన్నికల స్టంట్ బడ్జెట్

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌ను తలపిస్తోందని, కొత్త సీసాలో పాత సారా మాదిరిగా ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ఎద్దేవా చేశారు. బుధవారం షాపూర్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌పై ఆరోపణాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బడ్జెట్‌లో ఎంబీసీలకు రూ.1000 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు.

- బీసీ బంధు, గిరిజన బంధు ఏమయ్యాయని ప్రశ్నించారు. దళితబంధు పథకాన్ని సైతం సక్రమంగా అమలు చేయని దగాకోరుగా రాష్ట్ర ప్రభుత్వం మారిందన్నారు. నిరుద్యోగులకు రూ.3.016 నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కేసీఆర్ ప్రభుత్వం వంచించిందన్నారు.
- కేసీఆర్ మాయ మాటలు, జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణాలో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. విశ్వ నగరం అంటే జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్ లేనా.. కుత్బుల్లాపూర్ కాదా? అని మంత్రి కేటీఆర్‌ని ప్రశ్నించారు.
- ఒక్కసారి కుత్బుల్లాపూర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటించి ఇక్కడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఎన్నడూ కుత్బుల్లాపూర్ సమస్యలు పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో రాష్ట్రాన్ని తానే నడిపిస్తున్నట్లు ప్రసంగాలు చేయడం కాదని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమస్యలు లేవనెత్తాలన్నారు.
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 58, 59 జీవోల కింద దరఖాస్తు చేసుకున్న ఎంతమందికి క్రమబద్ధీకరించారో చెప్పాలన్నారు. దరఖాస్తుదారులకు మార్కెట్ విలువ కంటే అధిక మొత్తంలో డబ్బులు కట్టాలని పంపిన డిమాండ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తక్కువ ధరకే రెగ్యులరైజ్ చేయాలన్నారు.
- బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన జగద్గిరిగుట్ట బస్టాండ్, బస్సు డిపో హామీ ఏమైందని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇంకా పేదలకు ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



రాష్ట్ర బడ్జెట్ ప్రతులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

చిన్నారిపై విరుచుకుపడిన వీధి కుక్కలు

- రక్తపు మడుగులో ఉన్న చిన్నారిని ఆస్పత్రికి తరలింపు
- చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన కౌన్సిలర్ రాజిరెడ్డి
- పట్టించుకోని కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలో మరోమారు వీధి కుక్కల స్వైర్య విహారం చేశాయి. ఇటీవలే 8 మందిపై దాడి చేయగా ఈ విషయమై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా మరో ఘటన వెలుగు చూడటంతో ప్రజలు భయభ్రాతులకు గురవుతున్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధి 9వ వార్డులో ఇంటి ముందు ఆడుకుంటున్న బీహార్ వలస కార్మికుల కుమార్తె రవ్య కుమారి (7)పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. రక్తపు మడుగులో ఉన్న చిన్నారిని స్థానిక సురేఖ హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ రాజిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఇప్పటికే పదుల సంఖ్యలో కుక్కల దాడుల ఘటనలు వెలుగు చూసినా కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని పిల్లల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 45మందిపై కుక్కల దాడి..

గతంలో ఎన్‌సీఎల్ నార్త్ కాలనీ, నోబుల్ ఎన్‌క్లేవ్‌లలో వీధి కుక్కల దాడిలో 45 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎన్‌సీఎల్ పార్క్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు వీధి కుక్కల నుంచి మమ్మల్ని కాపాడాలంటూ ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలియజేశారు. గత నెల 11న చిన్నారి తనుశ్రీ (5)ను వీధి కుక్కలు విచక్షణా రహితంగా కరిచాయి. ఆ బాలిక ఇప్పటికీ కోలుకోలేదు. ఇదే విషయమై గత వారం కొంపల్లి బీజేపీ నాయకులు పురపాలక కమిషనర్ శ్రీహరిని కలిసి వీధికుక్కల నియంత్రణకై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని వినతి పత్రం ఇచ్చారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే మున్సిపాలిటీలో పిల్లలు, పెద్దలు ఇళ్ల లోంచి బయటికి వచ్చే పరిస్థితి లేదని రాజిరెడ్డి అన్నారు.



వీధి కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి రమ్యకుమారి

కార్పొరేషన్ అభివృద్ధిలో సమన్వయంతో పని చేయాలి

నిజాంపేట్: అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో అభివృద్ధి పనుల విషయమై ఇన్‌చార్జ్ కమిషనర్ రామృకష్ణారావుతో కలిసి మేయర్ ఆయా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం, వైకుంఠ ధామాలు, రోడ్డు విస్తరణ పనులు, తాగునీటి సరఫరా, వివిధ ప్రాంతాల్లో ప్రతిపాదనలు చేసిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విషయంలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ ఆనంద్, ఈఈ ప్రభాకర్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఇంజనీరింగ్, హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సరేష్‌రెడ్డి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు

కరాటే, కుంగ్‌ఫూ పోటీలో సత్తాచాటిన విద్యార్థులు



కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట: జాతీయస్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో కుత్బుల్లాపూర్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్, జగద్గిరిగుట్ట రాజధాని స్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటారు.



చట్టసభల కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన

కుత్బుల్లాపూర్: విద్యార్థుల్లో ఆల్ రౌండర్ డెవలప్‌మెంట్ కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వివేకానంద్ చేపడుతున్న ఇనిషియేటివ్‌లో భాగంగా ×ఈ చాంపియన్ ప్రొఫైల్జ్‌సంస్థ భాగస్వామ్యంతో మరో కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా చట్ట సభల్లోని కార్యకలాపాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం భగత్‌సింగ్‌నగర్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ముస్కాన్, గొట్టప్పు గుణవర్ధన్, కుత్బుల్లాపూర్ హైస్కూల్‌కు చెందిన ముడవత్ సుమిత్ర, మోడేపల్లి యశ్వంత్, గురుబిల్లి హేమలతలు అసెంబ్లీని సందర్శించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కావాల్సిన చట్టాలను రూపొందించడంలో శాసన సభ పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. భావిభారత పౌరులుగా నేటి విద్యార్థులకు చట్టసభల పట్ల అవగాహన ఉంటే వారి ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు దోహదపడుతుందని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌తో అసెంబ్లీ సమావేశాలకు హాజరైన విద్యార్థులు

ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడ్జెట్ తీరుతెన్నులు.. రకరకాల పద్దులు, వాటిపై విపక్షాలు అడిగే ప్రశ్నలకు అధికార పక్షాలు ఇచ్చే సమాధానాలను విద్యార్థులు మొట్ట మొదటిసారి ఎంతో ఆసక్తిగా తిలకించారు.

- అసెంబ్లీలో బడ్జెట్ తీరుతెన్నులను విద్యార్థులకు దగ్గరుండి చూపించిన ఎమ్మెల్యేకు తల్లిదండ్రుల కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన కల్పించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఎమ్మెల్యే వివేకానంద్ తీసుకుంటున్న చొరవను మెచ్చుకున్నారు.

అన్ని సబ్జెక్టులకు బోధన తరగతులు జరగడం లేదు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట బుధవారం విద్యార్థి జేఏసీ నాయకుడు సాయికుమార్ పంతుల ధర్నా ఆధ్వర్యంలో నిర్వహించారు. జూనియర్, వొకేషనల్ కళాశాల తరగతులు మధ్యాహ్నం వరకే నిర్వహించడంతో అన్ని సబ్జెక్టులకు బోధన తరగతులు జరగడం లేదన్నారు. ముఖ్యంగా ఒకేషనల్ విద్యార్థులకు టెస్ట్‌బుక్స్ అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్జెక్టుల వారీగా లెక్చరర్లను కూడా నియమించలేదన్నారు. అదే విధంగా ఒకేషనల్ డిగ్రీ కళాశాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పోస్ట్‌కార్డ్ ద్వారా తెలుపుతూ సీఎం క్యాంపు కార్యాలయానికి తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, జై గౌడ్, రంజిత్, జ్ఞానేశ్వర్, సునీల్, శేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



బహదూర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

హాస్టల్ నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: హాస్టల్ నిర్వాహకులు సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు స్పష్టం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్లో సీఐ ప్రశాంత్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 168 మంది హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామలింగరాజు మాట్లాడుతూ.. హాస్టల్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. హాస్టల్‌లలో చేరే వారి వివరాలను సేకరించిన తర్వాతనే వారిని చేర్చుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాటికి అనుసంధానంగా పోలీస్‌స్టేషన్‌కు లింకు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా తనిఖీలు చేసే సమయంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిస్తే మాత్రం వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా బుధవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, ఏకలవ్యనగర్, జీవన్ జ్యోతినగర్, ముత్తయ్య బస్తీ, సుందర్‌నగర్, కూన మహాలక్ష్మినగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గడపకు తిరుగుతూ హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లు అతికించి కాంగ్రెస్ పార్టీని బలపరిచారని కోరారు.

సదుపాయాల కల్పనకు కృషి

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఊర చెరువు, కేటీఆర్ పార్క్,దూలపల్లిలోని లింగయ్యచెరువు, తుమార్ చెరువు, వైకంఠధామాలను కమిషనర్ శ్రీహరి, 16వ వార్డు కౌన్సిలర్ చింతల రవీందర్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. చెరువులను అభివృద్ధి పరిచి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

పురవీధుల్లో వేణుగోపాలుడు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పురవిధుల గుండా జరిగిన స్వామివారి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని హారతులు పట్టి టెంకాయలు కొట్టారు. ఊరేగింపులో యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ బస్ సర్వీసులు ప్రారంభించాలి

జీడిమెట్ల: జీడిమెట్ల డిపోలో డబుల్ డెక్కర్ బస్సు సర్వీసులు ప్రారంభించాలని టీఆర్ఎస్‌కేవీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ బుధవారం జీడిమెట్ల బస్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడిమెట్ల, గాం, దీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతాలున్న ఈ ప్రాంతానికి మెట్రో రైల్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సు సర్వీసులు నడిపితే ప్రయాణికుల ఇబ్బందులు కొంత మేరకు తీరుతాయన్నారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు.

సంక్షిప్త వార్తలు

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతి




జగద్గిరిగుట్ట: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్ కాలనీ ధరణి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుభాష్(40)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే తాగుడుకు బానిసకావడంతో ఐదేళ్ల క్రితం భార్య అతని నుంచి విడిపోయి వేరుగా ఉంటోంది. బుధవారం ఎల్లమ్మబండ సమీపంలో రైతుబజారు సమీపంలో సుభాష్ నడుపుతున్న ఆటో (ఏపీ 28టీసీ 5918)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రీసైక్లింగ్ యూనిట్‌లో పేలుడు

- మహిళకు గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

జీడిమెట్ల: ఓ రీసైక్లింగ్ పరిశ్రమలో రసాయన డబ్బా పేలడంతో ఓ మహిళా దినసరి కూలీ గాయపడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. కైసర్‌నగర్‌కు చెందిన సద్దాం అనే వ్యక్తి సుభాష్‌నగర్‌లోని గంపలబస్తీలో రీసైక్లింగ్ గోదాం నిర్వహిస్తున్నాడు. జీడిమెట్లలోని వివిధ పరిశ్రమల నుంచి స్క్రాప్‌ను కొనుగోలు చేసి గోదాంలో వాటిని కూలీలతో వేరు చేయిస్తుంటాడు.ఈ రోజు ఉదయం గంపలబస్తీకి చెందిన రిజ్వానా(30) రీసైక్లింగ్ యూనిట్‌కు కూలీకి వెళ్లింది. మధ్యాహ్నం 2గంటల సమయంలో యూనిట్‌లో చిన్నచిన్న రసాయన డబ్బాల నుంచి మూతలను వేరు చేస్తోంది. డబ్బా నుంచి మూతను వేరు చేసేందుకు రిజ్వానా సుత్తెతో డబ్బాను కొట్టింది. డబ్బాలో రసాయనాలు ఉండటంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో రిజ్వానా గాయపడింది. వెంటనే ఆమెను సుచిత్రలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదం సంభవించిన రీసైక్లింగ్ యూనిట్